సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 5 । మే । 2023



సంక్షేమం విస్మరించిన ప్రభుత్వాలు
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశాయని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి ఆరోపించారు. 8లో▸

ఉచిత వేసవి శిక్షణ తరగతులు
హుడాకాంప్లెక్స్: సాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ వసుధామూర్తి తెలిపారు. హుడాకాంప్లెక్స్ రామాలయంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయని, ఆసక్తి గల విద్యార్థులు హాజరు కావొచ్చని పేర్కొన్నారు. ఈ నెల 5న నల్లకుంటలోని శృంగేరి శంకర్ మఠల్‌లో నవరత్న మాల శీర్షికతో సామూహిక సంకీర్తన అర్చన ఉంటుందన్నారు.



జేపీఎస్‌లకు అండగా ఉంటాం
పంచాయతీ జూనియర్ కార్యదర్శులకు అన్నివిధాలా అండగా ఉంటామని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ తెలిపారు. 8లో▸

బీజేపీ విజయం ఖాయం

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



మాట్లాడుతున్న బండి సంజయ్

మహేశ్వరం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరంలో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ జన్మదినం సందర్భంగా తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి బాలాపూర్ చౌరస్తా, బడంగ్‌పేట్, నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయం వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనకు అంతిమ ఘడియలు మొదలయ్యాయని, ప్రజల్లో బీఆర్ఎస్‌పై నమ్మకం పోయిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైన ప్రతి నాయకుడు, కార్యకర్త పోరాడాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ఉచిత ఆరోగ్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్ శర్మ, బోసుపల్లి ప్రతాప్, సామల రంగారెడ్డి, ఎల్మటి దేవేందర్ రెడ్డి, దీరజ్‌రెడ్డి, మధుమోహన్, మంద్రయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘జంగ్ సైరన్’ను జయప్రదం చేయండి



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

హుడాకాంప్లెక్స్: పీసీసీ ఆధ్వర్యంలో ఈ నెల 8న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే విద్యార్థి నిరుద్యోగ జంగ్ సైరన్ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ పర్యటనలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ హాజరవుతారని తెలిపారు. గురువారం సభకు సంబంధించిన ఏర్పాట్లను ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వేం నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ బండి మధుసూదన్‌రావుతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేశ్‌నేత, ఇతర నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌పీఎస్‌కు విద్యార్థుల ఎంపిక

ఇబ్రహీంపట్నం రూరల్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట, రామంతాపూర్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాల ప్రక్రియ పూర్తయింది. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ హరీశ్ చేతుల మీదుగా లక్కీడిప్ ద్వారా సీట్లు కేటాయించారు. 2023–24కుగాను ఒకటో తరగతిలో ప్రవేశం కోసం షెడ్యూల్డ్ కులాల బాలబాలికల నుంచి దరఖాస్తులు తీసుకున్న సంగతి తెలిసిందే. లాటరీలో కత్తుల అక్షతేజ (బేగంపేట్ పబ్లిక్ స్కూల్), సిలివేరి యోక్షిత (బేగంపేట్ పబ్లిక్ స్కూల్), కోమలశెట్టి జైన్య (రామంతాపూర్ పబ్లిక్‌స్కూల్) సీట్లు సాధించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ డైరెక్టర్ రామారావు తెలిపారు.

ఇళ్లు లేని పేదలు ఉండొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

- ఇదే కేసీఆర్ లక్ష్యం
- సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి
- నందిగామలో 'డబుల్' లబ్ధిదారుల ఎంపికకు లక్కీ డ్రా

నందిగామ: రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు ఉండరాదన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు జిలెల్ల వెంకట్‌రెడ్డి అన్నారు. నందిగామ జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో గురువారం డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపునకు లక్కీ డ్రా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నందిగామలో డబుల్ ఇళ్లకు 429 దరఖాస్తులు వచ్చాయని, అందులో 21 డబుల్ ఎంట్రీలను తొలగించారని తెలిపారు. మిగిలిన 408 దరఖాస్తుల్లో సమగ్ర విచారణ జరిపి 120 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. ప్రస్తుతం లక్కీ డ్రా ద్వారా 100 మందికి ఎంపిక చేసి ఇళ్లు కేటాయించినట్లు వివరించారు. మిగతా 20 మంది దరఖాస్తులను పునఃపరిశీలన చేసి అర్హులైన వారికి ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజేశ్వరీ, ఎంపీపీ ప్రియాంక, తహసీల్దార్ రహమాన్ ఖాన్, ఎంపీడీఓ బాల్‌రెడ్డి, ఎంపీటీసీలు కే కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, ఉప సర్పంచ్ ఎం కుమార్ గౌడ్, ఎస్ఎంసీ చైర్మన్ రాములు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

- అధికారం కోసం బీజేపీ అడ్డదారులు
- రాష్ట్రంలో కుటుంబ పాలన
- హాత్ సే హాత్ జోడో యాత్రలో ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న వంశీచంద్‌రెడ్డి తదితరులు

కడ్తాల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి, ప్రజా కంటక పాలన సాగిస్తున్నాయని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి ఆరోపించారు. దేశంలో విద్వేషం, విభజన, ప్రజల మధ్య చిచ్చుపెట్టి అధికారం కోసం బీజేపీ అడ్డదారులు తొక్కుతోందని మండిపడ్డారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు భారత్ జోడో యాత్ర చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారని పేర్కొన్నారు. అదే స్ఫూర్తి కొనసాగించాలన్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు జోడ్ యాత్ర అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం కడ్తాల్ మండలం పిల్లిగుండు తండా, పెద్దారెడ్డి చెరువు తండాలో స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఆయా తండాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిందని, రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా హామీలను విస్మరించిందని ఆరోపించారు. అవినీతి, కుటుంబ పాలన సాగిస్తోందని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదన్నారు. బీఆర్ఎస్ స్థాపన పేరుతో మరో సారి సెంటిమెంట్‌తో రాష్ట్ర ప్రజలను మోసం చేయాలని చూస్తోందని విమర్శించారు. కే జీ టు పీజీ ఉచిత విద్య, డబుల్ బెడ్ రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, దళితులకు 3 ఎకరాల భూమి, రుణమాఫీ తదితర హామీలను తుంగలో తొక్కిందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కో–ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, కడ్తాల్, తలకొండపల్లి మండలాల అధ్యక్షులు భీచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు సేవ్యా, శంకర్, పాండునాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్ పాల్గొన్నారు.

రైల్వే పార్కింగ్‌లో బైక్ చోరీ

శంకర్‌పల్లి: స్థానిక రైల్వేస్టేషన్ పార్కింగ్‌లో ఉంచిన బైక్‌ను గుర్తుతెలియని దొంగలు అపహరించుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్‌పల్లి సాయినగర్ కాలనీకి చెందిన పరమేశ్వర్ బుధవారం ఉదయం శంకర్‌పల్లి రైల్వే పార్కింగ్‌లో తన బైక్‌ను పార్క్ చేసి లక్డికపూల్‌లో గల డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌లో విధులకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో గురువారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మసాజ్ సెంటర్‌పై పోలీసుల దాడులు



యువతులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

షాద్‌నగర్ రూరల్: అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారంతో పోలీసులు పట్టణంలోని ఓ మసాజ్ సెంటర్‌పై గురువారం దాడి చేశారు. షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ గురువారం సిబ్బందితో కలపి మహబూబ్‌నగర్ రోడ్డులోని ఫ్రెండ్ ప్రొఫెషనల్ మసాజ్ సెంటర్‌లో తనిఖీలు చేశారు. ముగ్గురు యువతులను అదుపులోకి తీసుకొని స్టేషన్ తరలించారు. కేంద్రం నిర్వాహకులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

వలస కూలీ ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: వలస కూలీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజబాబు, సుమిరియా దంపతులు. వారి కుమారుడు సుకిత్ యాదవ్‌తో కలసి పట్టణంలోని జీవీకే దేశ్ పౌల్ట్రీ ఫాంలో పని చేస్తున్నారు. పదిహేను రోజుల క్రితం బంధువుల వివాహం కోసం తల్లిదండ్రులు మధ్యప్రదేశ్‌కు వెళ్లారు. సుమిత్ యాదవ్ బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని చనిపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'ఉపాధి' కూలీలకు బకాయిలు చెల్లించండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న శ్రీనునాయక్

షాద్‌నగర్: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలం చించోడ్ గ్రామంలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం శ్రీనునాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధి కూలీలకు పనికి సరిపడా వేతనం ఇవ్వడం లేదన్నారు. ప్రతి కూలీకి రోజుకు ఆరు వందలు ఇవ్వాలని, 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఉపాధి హామీ పథకానికి ప్రతి ఏటా బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తోందని అన్నారు. కొలతలతో సంబంధం లేకుండా కూలీ డబ్బులు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దాస్యనాయక్, లక్ష్మణ్ నాయక్, శంకర్, గోపాల్, శ్రీను, మల్లేష్, చంద్రమ్మ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ఇబ్రహీంపట్నం రూరల్: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ లక్ష్మీనారాయణ కథనం ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వ్యక్తి చనిపోయినట్లు గుర్తించారు. అతని వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని, బ్రౌన్ కలర్ ప్యాంట్, ఎత్తు 5.7 అడుగులు ఉంటాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఆదిబట్ల పోలీసులను సంప్రదించాలని కోరారు.

వెనక్కి దూసుకొచ్చిన డీసీఎం

ఢీకొని మహిళ మృతి



మోతీ మృతదేహం

పహాడీషరీఫ్: బ్యాటరీ మారుస్తున్న డీసీఎం వాహనం ఒక్కసారిగా స్టార్ అయ్యి డ్రైవర్ లేకుండానే వెనక్కు దూసుకరావడంతో దాని కింద పడి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మహబూబ్‌నగర్ జిల్లా బాల్‌నగర్ మండలం చిన్నరేవల్లికి చెందిన హరి, ముడావత్ మోత(56) దంపతులు. చాలా ఏళ్ల క్రితం మామిడిపల్లి రంగనాయకుల కాలనీకి వలస వచ్చారు. కాలనీలోని రేషన్ షాప్‌లో బియ్యం తీసుకునేందుకు మోతీ మధ్యాహ్నం వచ్చింది. అదే సమయంలో రేషన్ దుకాణానికి ఎగువన డీసీఎం వ్యాన్ స్టార్ట్ కాకపోవడంతో డ్రైవర్ కుర్మయ్య మరో బ్యాటరీని అమర్చుతున్నాడు. ఈ సమయంలోనే ఒక్కసారిగా వాహనం స్టార్ట్ అయ్యి డ్రైవర్ లేకుండానే వెనక్కు దూసుకొచ్చింది. రేషన్ షాప్ వద్ద ఉన్న జనం గమనించి పరుగులు తీశారు. అంతకుముందే కాలికి గాయం కావడంతో మోతీ కదలలేకపోయింది. దీంతో వేగంగా వచ్చిన డీసీఎం ఆమెను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ పరారీలో ఉన్నాడు. అయితే డ్రైవర్ టైర్ల కింద రాయి పెట్టకపోవడంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. మృతురాలి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోయిన నగలు బాధితురాలి చెంతకు..

3గంటల్లో అందజేసిన పోలీసులు



బాధితురాలి సోదరుడికి ఆభరణాలు అందజేస్తున్న ఎస్ఐ మన్మథకుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: శుభకార్యానికి హాజరైన ఓ మహిళ బ్యాగులోంచి పోయిన 16తులాల బంగారు ఆభరణాలు పోలీసుల చొరవతో బాధితురాలికి అందాయి. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరుకు చెందిన వెంకటరత్నమ్మ అబ్దుల్లాపూర్‌మెట్‌లోని మినీ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన బంధువుల శుభకార్యానికి హాజరయ్యారు. కార్యక్రమం ముగియడంతో ఊరికి బయలుదేరింది. ఈ క్రమంలో తన బ్యాగులో ఉంచిన 16 తులాల బంగారు ఆభరణాలను చూసుకోగా కనిపించలేదు. దీంతో పరిసరాల్లో వెతికింది. కనిపించకపోవడంతో బాధితురాలి సోదరుడు చిరంజీవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వెంకటరాంరెడ్డి, సిబ్బంది రమణ, శ్రీధర్, రాజులు ఘటనా స్థలానికి చేరుకొని అక్కడి సీసీ కెమెరాలను పరిశీలించారు. ఫంక్షన్ హాల్‌లో ఒక చోట నగలు లభ్యమయ్యాయి. వాటిని పోలీసులు బాధితురాలి సోదరుడికి అందజేశారు. దీంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

జేపీఎస్‌లకు అండగా ఉంటాం

షాద్‌నగర్‌రూరల్: పంచాయతీ జూనియర్ కార్యదర్శులను పర్మినెంట్ చేయకపోతే పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును అడ్డుకుంటామని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ హెచ్చరించారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం ఏడో రోజుకు చేరింది. సమ్మెకు ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాలుగేళ్ల గడువు పూర్తయినప్పటికీ పంచాయతీ జూనియర్ కార్యదర్శుల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకపోవడం బాధాకరమన్నారు. రెగ్యులరైజేషన్‌పై ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరితో రాష్ట్రంలో సుమారు 9వేలమంది పంచాయతీ కార్యదర్శులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఎన్ఎస్‌యూఐ జాతీయ కన్వీనర్ దినేష్‌సాగర్, జిల్లా కార్యదర్శి ఉదయ్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు జీజో జాన్సన్, పంచాయితీ క్యాదర్శులు పాల్గొన్నారు.

డీసీసీ ఉపాధ్యక్షుడిగా రాములు



రాములకు నియామకపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జోత్స్నరెడ్డి, నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు సీ సత్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం చేవెళ్లలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పీ రాములుకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. పీసీసీ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి, నియోజకవర్గ నాయకులు ఎస్ వసంతం, పామెన భీమ్‌భరత్, షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల సర్పంచ్ శైలజ, పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు వాజీద్, యూత్ విభాగం అధ్యక్షుడు పెంటారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోండి

లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

షాద్‌నగర్ రూరల్: మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి బైపాస్ సమీపంలో గల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందని, ఈ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చటాన్‌పల్లి వద్ద మున్సిపాలిటీకి చెందిన 3,630 గజాల స్థలం ఉందని, దాన్ని కొందరు ఆక్రమించారని తెలిపారు. స్థలం విలువ కోట్లలో ఉంటుందని అన్నారు. భూ కబ్జాపై ఇటీవల హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. విచారణ జరిపి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఆ దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పేదల సంక్షేమం కాంగ్రెస్‌కే సాధ్యం



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

మణికొండ: రాష్ట్రంలో, దేశంలో పేదల సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేశ్ సారథ్యంలో వందలాది మంది వడ్డెరలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇంటి స్థలాలు, ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు రుణమాఫీ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ మాట్లాడుతూ..రాజేంద్రనగర్ నియోజకవర్గంలో సమర్థుడైన నాయకుడు లేక వెనకబడి పోతుందని ఆరోపించారు. శంషాబాద్ కేంద్రంగా 35 ఎకరాల ప్రభుత్వ భూములు ఎమ్మెల్యే అనుచరులు కబ్జాలకు పాల్పడితే కాంగ్రెస్ పార్టీ పోరాటం చేసి ప్రభుత్వ పరం చేసిందన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు ఎన్ని ఇళ్ల పట్టాలు ఇచ్చారు, ఎన్ని డబుల్ బెడ్‌రూంలు ఇచ్చారనే విషయంపై ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు దమ్ముంటే చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వడ్డెరలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు తామంతా కాంగ్రెస్ పక్షాన నిలుస్తామన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో వడ్డెరులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.25 కోట్ల నిధులు, ఫెడరేషన్ ఇచ్చారని, ఇక్కడ రూ. 30లక్షలు ఇస్తానని ఒక్క రూపాయి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జితేందర్, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, నాయకులు కిరణ్‌కుమార్, రాజు, లక్ష్మీనారాయణ, తాజుద్దీన్, పద్మారావు, పురుషోత్తం, కస్తూరి యాదయ్య, మాల్యాద్రినాయుడు పాల్గొన్నారు.

అమెరికా బయలుదేరిన ఎంపీ రంజిత్‌రెడ్డి

శంషాబాద్: చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ సభ్యుడు రంజిత్‌రెడ్డి, సీతారెడ్డి దంపతులు గురువారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయం నుంచి అమెరికా బయలుదేరి వెళ్లారు. కుమారుడి గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని దగ్గరుండి చూసేందుకు వెళ్లినట్లు తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎవైనా అత్యవసర పనులు ఉంటే తన కార్యాలయంలో సంప్రదించవచ్చని ఆయన సూచించారు. మరో 15 రోజుల్లో అమెరికా నుంచి తిరిగి రానున్నట్లు తెలిపారు.